క్లుప్తంగా

గుత్తి కోట ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: పట్టణంలోని కోటలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న హజరత్ సయ్యద్ 678వ ఉరుసు మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా చేతుల మీదగా ఉరుసు కమిటీ సభ్యులు పోస్టర్లను ఆవిష్కరింపజేయించారు. ఈ నెల 12 న గంధం, 13 ఉరుసు, 14న జియారత్ ఉంటుందని ఉరుసు కమిటీ సభ్యులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి'

యాడికి: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ వాసులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో ఉన్న ప్రధాన కూడలిలో స్థలాన్ని కేటాయించాలని కొద్ది నెలల క్రితం తహసీల్దార్‌కు విన్నవించామన్నారు. స్థలాన్ని పరిశీలించి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని వారు కోరారు. శివప్రసాద్, వెంకటరాముడు, శ్రీరాములు, రంగస్వామి, నాగేంద్ర, ప్రేమసాగర్, నాగార్జున, అరవింద్, ఓం ప్రకాష్, మదన్ రాజు, అరుణ, ఓబులేసు, సురేంద్ర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించండి

శింగనమల: ఉపాధి హామీ పథకానికి సంబంధించి పెండింగ్ ఉన్న 10 వారాల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు కోరారు. శనివారం నార్పలలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్నాగప్ప, రాజశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, నారాయణస్వామి, ఆంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయండి



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: లక్ష్యం వైపు దూసుకుపోవడానికి మరింతగా కృషిపడాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం 29వ వార్డులోని సచివాలయంలో ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో 279వ ర్యాంకు సాధించి వరంగల్ ఎన్ఐటీలో సీటు దక్కించుకున్న మహేష్‌తో పాటు ఐఐటీ చైన్నైలో థర్డ్ ఇయర్ చదువుతున్న అష్రఫుల్‌హక్‌కు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా తహసీల్దార్‌తోపాటు రిటైర్డు ప్రిన్సిపాల్ ఆర్‌కే నాయుడు హాజరై విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

యల్లనూరు/యాడికి: చిన్న వయస్సులోనే ఆడ పిల్లలకు వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజామణి, శాంతమ్మ అవగాహన కల్పించారు. శనివారం యల్లనూరుమండలంలోని వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నార్పల ప్రాజెక్టు సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలల హక్కు చట్టాలపై వివరించారు. హెచ్ఎంలు రంగనాయకమ్మ, షఫీ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని కోనుప్పలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పీసీ, పీఎన్‌డీటీ చట్టంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి జీసీడీపీఓ సాజిదాభేగం మాట్లాడారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

శింగనమల(నార్పల): నార్పల ఎంపీడీఓ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం జెడ్పీ సీఈఓ శివశంకర్ , డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. గత రెండు సంవత్సరాల మండల పరిషత్ నిధులు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనుల గురించి ఎంపీడీఓ మమతాదేవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, ఏఓ శేషారెడ్డి, సిబ్బంది సుభాన్, రవీంద్రారెడ్డి, ఏపీఓ ఎర్రమ్మ, రమేష్, రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే..రోగాలు రావా?



గుంతకల్లులోని 28వ వార్డులో రోడ్డుపై అపరిశుభ్రత



ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద చెత్తకుప్పలు



బెంచికొట్టాల రోడ్డుపై నిలిచిన మురుగు

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం లోపించింది. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగక కాలనీలు చెత్తాచెదారంతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మురుగు నిల్వ ఉండి దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికితోడు వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా పట్టణంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఫీవర్ కేసులతో కిటకిటలాడుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంలోనూ తీవ్రమైన నిర్లక్ష్యం కనిపిస్తోంది. పారిశుధ్యాన్ని మెరుగుపరచండి మహాప్రభో అని విన్నవించుకున్నా మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు అన్ని వార్డుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుత్తి: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సచివాలయ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సచివాలయ అసోసియేషన్ నాయకులు వినయ్, స్టాన్లీ ప్రశాంత్, కిరణ్‌కుమార్, వెంకట్, గంగాధర్, ప్రణతి తదితరులు మాట్లాడారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, నాలుగు డీఏలు ఇవ్వాలని, ఒకే మాతృశాఖ కింద ఆత్మగౌరవంతో పని చేయడానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వేలను సంబంధిత శాఖల ద్వారా నిర్వహించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, ఆటో మేటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్‌ను వర్తింపజేయాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు.

కార్యకర్తలను పరామర్శించిన ఆలూరు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: అనారోగ్యంతో చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పుట్లూరు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను శనివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. అరకటివేములలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి భార్య అమరావతి, సూరేపల్లిలో కార్యకర్త నాగశేఖర్‌ను పరామర్శించారు. ఓబుళాపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రమణయాదవ్ తండ్రి క్రిష్టయ్యను పరామర్శించి ఆరోగ్యస్థితి గురించి తెలుసుకున్నారు. కుమ్మనమలలో వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా గాయపడిన కార్యకర్తలు శ్రీనివాసులు, నాగర్జునను పరామర్శించారు. వెంగన్నపల్లిలో బైక్ ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుధాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మూలి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆందోళన



నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

గుంతకల్లు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపును నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. శనివారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ సంయుక్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టిన తరువాత కార్పొరేట్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారతదేశం, ఇతర దేశాలపై ఆర్థిక దాడులు చేస్తున్నారని విమర్శించారు. మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతులపై 50 శాతం సుంకం పెంచడం దారుణమన్నారు. అంతేకాకుండా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలును ఆపాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, వీరభద్రస్వామి, రాము, ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు, సీపీఎం నాయకులు బీ.శ్రీనివాసులు, మారుతిప్రసాద్, జగ్గలి రమేష్, రామునాయక్, తిమ్మప్ప, సీపీఎం న్యూ డెమోక్రసీ నాయకులు బీ.సురేష్, జీలాన్, షెక్షావలి, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 'కూటమి' నిర్లక్ష్యం



మాట్లాడుతున్న నార్పల సత్యనారాయణరెడ్డి

శింగనమల(నార్పల): రైతు సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి మండిపడ్డారు. శనివారం మండల కన్వీనర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న అనంతతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ నిర్వహించే రైతు పోరు నిరసన ర్యాలీకి జిల్లా నలుమూలాల నుంచి రైతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ అమీర్, నాయకులు సొహెల్, సంజీవరెడ్డి, రవి, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్లను స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విడుదల చేయనున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆమె శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గార్లదిన్నె: శింగనమల మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు రైతుపోరు కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు విడుదల చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ రైతన్నకు బాసటగా అనంతపురంలో మంగళవారం రైతుపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: కులవృత్తిపై ఆధారపడి బతుకుతున్న నాయీబ్రాహ్మణుల పొట్ట కొడుతున్న కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకూ పోరాడుతామని ప్రజా, కులసంఘాల నేతలు తీర్మానించారు. శనివారం సంచార జాతుల సంఘం కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన 'కార్పొరేట్ సెలూన్లు-క్షౌ రవృత్తిపై ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, కాటికాపర్ల సంఘం రాష్ట్ర నాయకుడు జగ్గిలి రమేష్, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేంద్రప్ప, వాల్మీకి సంఘం పట్టణ కార్యదర్శి మాచర్ల ఎల్లప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత స్వామీదాస్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు మాట్లాడారు. గుంతకల్లులో ఇతర వర్గాల వారు ఆధునిక సెలూన్లు తెరిచి వేరే రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకోవడం వల్ల స్థానికంగా ఉన్న పేద నాయీబ్రాహ్మణ కుటుంబాల ఆర్థిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. కొత్తగా కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటు చేయరాదని, ఇదివరకే ఏర్పాటు చేసిన వాటిని తొలగించే వరకు నాయీబ్రాహ్మణులు చేపట్టే పోరాటానికి మద్దతిస్తామని వివిధ కుల, ప్రజాసంఘాల నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు జన్నేమస్తాన్, ఆదినారాయణ, రమేష్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దు

పెద్దవడుగూరు: రైతులకు యూరియా పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. శనివారం మండలంలోని విరుపాపురంలో రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం యూరియా కోసం వచ్చిన రైతులతో ఆమె మాట్లాడారు. మండలానికి 50 టన్నుల యూరియా సరఫరా అయిందని, విరుపాపురం, అప్పేచర్ల, చిత్రచేడు, దిమ్మగుడి గ్రామ రైతు సేవా కేంద్రానికి 12.6 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాడికి: యూరియాను అధిక ధరలకు విక్రయించే ఫర్టిలై జర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఏఓ మహబూబ్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ క్రిష్టప్ప హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని సుఫల ఫర్టిలైజర్ దుకాణాన్ని వారు తనిఖీ చేశారు. 290 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎరువులు కొన్న రైతులు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి ఆర్‌కేఎస్‌ను శనివారం ఏడీఏ రవి, ఏఓ ఆంజనేయులు తనిఖీ చేశారు. రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయాలని విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌కు సూచించారు. టెక్నికల్ ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ విశ్వేశ్వరి పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం మూసివేత

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని గూగూడులో కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాలను చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సోమవారం ఉదయం 5 వరకూ మూసివేస్తామని ఈఓ శోభ శనివారం తెలిపారు. ఆలయ శుద్ధి అనంతరం భక్తులు స్వామి వార్లను దర్శనం చేసుకోవచ్చన్నారు.

ఆంజనేయ స్వామికి 101 టెంకాయలు

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి సోమవారం సాయంత్రం గ్రామంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామికి 101 టెంకాయలు కొట్టి తన మొక్కుబడి తీర్చుకుంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోని తన స్వగృహానికి చేరుకుంటే పెద్దపేట గ్రామంలోని అభయాంజనేయ స్వామి 101 టెంకాయలు కొట్టుతానని గతంలో ఆమె మొక్కుకుంది. కార్యక్రమంలో ఆదినారాయణ, రామాంజి, శివ, నాగరాజు, మారుతి, కిట్టప్ప, రాఘవేంద్ర, నాగేష్, పెద్దన్న, మోహన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం

బుక్కరాయసముద్రం/శింగనమల: ఉద్యాన పంటలు సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని రేకులకుంట పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిలో ఉద్యాన శాఖ అధికారి శైలజ ఆధ్వర్యంలో అరటి సాగులో యాజమాన్య పద్ధతులు, నాణ్యమైన దిగుబడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన శాఖ ద్వారా మామిడి, దానిమ్మ, అంజూర, నేరేడు, జామ, బొప్పాయి, తోటలకు 40 శాతం సబ్సిడితో ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. పంటలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ రూంలు, సోలార్ డ్రై యూనిట్లు, 35 శాతం రాయితీ ఇస్తామన్నారు.కార్యక్రమంలో కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, ఉద్యాన సిబ్బంది శాంతి, షరీఫ్, ఓబులపతి, రైతులు పాల్గొన్నారు. అలాగే శింగనమల మండలంలోని వెస్ట్ నరసాపురం రైతు సేవా కేంద్రంలో చీని పాత తోటల పునరుద్ధరణ పద్ధతులు, తెగులు చీడ పీడల నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో రేకుల కుంట ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం ఉద్యాన అధికారి శైలజ, సిబ్బంది మల్లీశ్వరి, ఉమాదేవి పాల్గొన్నారు.

పత్తి, మొక్కజొన్న పంటల పరిశీలన

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపల్లి, తాతగారిపల్లిలోని పత్తి, మొక్కజొన్న పంటలను శనివారం ఏఓ ఆంజనేయులు పరిశీలించారు. పంటలకు వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలను రైతులకు వివరించారు.

ఉప ప్రధాన అర్చకుడిగా ప్రశాంత్



ప్రశాంత్‌కు పదోన్నతి పత్రం అందజేస్తున్న ఈఓ విజయరాజు

గుంతకల్లు: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడిగా కొత్తకోట ప్రశాంత్‌కుమార్‌కు పదోన్నతి లభించింది. ఆలయ ఉప ప్రధాన అర్చకుడిగా ఉన్న రాఘవచార్యులు ఇటీవల ఆలయ ప్రధాన అర్చకుడిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆలయ ముఖ్య అర్చకుడిగా ఉన్న ప్రశాంత్‌కు ఉప ప్రధాన అర్చకుడిగా పదోన్నతి కల్పించారు. దీంతో శనివారం ఈఓ విజయరాజు పదోన్నతి పత్రంను ప్రశాంత్‌కు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

గుత్తి ఆర్ఎస్‌లో అప్రకటిత విద్యుత్ కోత

గుత్తి: గుత్తి ఆర్ఎస్, ఎస్ఎస్ పల్లి, చెట్నేపల్లిలో శనివారం అధికారులు ఎలాంటి ముందస్తు ప్రకటన ఇవ్వకుండా ఏకంగా ఏడు గంటల పాటు అప్రకటిత విద్యుత్ కోతను విధించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేశారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఇలా ఏకంగా ఏడు గంటల పాటు విద్యుత్‌ను తీసేయడం ఏమిటని ఆర్ఎస్‌కు చెందిన రైల్వే రిటైర్డ్ ఎంప్లాయి రమేష్‌బాబు, హరి, శ్రీనివాసులు, వరదా, నారాయణ స్వామి తదితరులు విమర్శించారు. ఇక మీదట విద్యుత్‌ను గంటల తరబడి నిలిపివేస్తే ప్రైవేట్ ఫిర్యాదు ఇవ్వాల్సి వస్తుందన్నారు.

కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని జెండా వీధిలో శనివారం ఓ కుక్క స్వైర విహారం చేసింది. నడుచుకుంటూ వెళుతున్న గోపి అనే వ్యక్తిపై దాడి చేసి కరిచింది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలో కుక్కల దాడి అధికమైంది. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

10న మండల సమావేశం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సదాశివం శనివారం తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి భస్మాభిషేకం



అలంకరణలో స్వామి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి శనివారం భస్మాభిషేకంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారిని అర్చకులు భస్మంతో అభిషేకించారు. అనంతరం స్వామి వారిని గంధంతో పూతతో పాటు పూలమాలతో అలంకరించారు. స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

వైభవంగా మహిళా సున్నీ ఇస్తెమా



హాజరైన ముస్లిం మహిళలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పాత ఈద్గా మైదానంలో శనివారం రాత్రి మహిళా సున్నీ ఇస్తెమా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ముస్లిం మహిళల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, గుల్బర్గాల నుంచి ప్రముఖులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బైక్ బోల్తా.. వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కలసట్ల గ్రామ శివారులో శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి చెన్నకృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు శివారులోని కనకపురకు చెందిన చెన్నకృష్ణ గ్రామాల్లో తిరుగుతూ టార్పాలిన్లు విక్రయించేవాడు. ఈ క్రమంలో కలసట్ల గ్రామానికి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బందార్లపల్లికి చెందిన భాగ్య అనే యువతి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భాగ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. పలు చోట్ల చికిత్సలు చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భాగ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న యువతిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

పామిడి: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 8న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఏపీ రైతుసంఘం 9వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల నాయకుడు పి.అనిమిరెడ్డి శనివారం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై సమీక్షించే మహాసభలకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

'శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి'

గుంతకల్లు రూరల్: స్థానిక దోనిముక్కల రోడ్డు సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో క్రైస్తవులకు ప్రభుత్వ శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ యునైటెడ్ క్రిష్టియన్ వెల్‌ఫేర్ ఫోరం సభ్యులు శనివారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. దోనిముక్కల రోడ్డులో నూతన శ్మశాన వాటికను ఏర్పాటు చేయడంతో పాటు, కసాపురం రోడ్డు సమీపంలో ఉన్న క్రిష్టియన్ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యూసీడబ్ల్యూఎఫ్ జనరల్ సెక్రటరీ కె.ఎస్.జయపాల్, ట్రెజరర్ ఆంథోని, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పామిడికి చేరిన పాదయాత్ర

పామిడి: కర్నూలు జిల్లా సరిహద్దు నుంచి అనంతపురం వరకూ వంద కిలోమీటర్ల మేర సేవ్ ఆర్టీటీపై ప్రజా ఉద్యమ నేత సాకే గోవిందు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం సాయంత్రం పామిడికి చేరింది. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, ప్రజా ఉద్యమనేత సాకే ఓబులేసు మాట్లాడారు. ఈ నెల 8న కలెక్టరేట్ వద్ద ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యువల్‌కు పెద్దఎత్తున గళం విప్పాలన్నారు. కార్యక్రమానికి ఆర్టీటీ అభిమానులు, ప్రజలు తరలిరావాలన్నారు.

'ప్రభుత్వ భూమి దళితులకే చెందాలి'

గార్లదిన్నె: దళితులకు ఇచ్చిన ప్రభుత్వ భూమి దళితులకే చెందాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుల్లాయప్ప కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షకు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పెనకచెర్ల రెవెన్యూ పొలంలో ముకుందాపురం గ్రామ దళితులకు 1983లో అప్పటి ప్రభుత్వం సాగుభూమి పంపిణీ చేసిందన్నారు. అయితే దళితులు కూలి పనుల కోసం వలస వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన సూర్యచంద్రరెడ్డి అధికారులతో కుమ్మక్కు తన పేరు మీద ఆన్‌లైన్‌లో భూమి నమోదు చేయించుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు భూ రికార్డులు పరిశీలించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, చెన్నారెడ్డి, ఓబిలేసు, బాధిత రైతులు పాల్గొన్నారు.

'వెరిఫికేషన్‌కు ప్రజలు సహకరించాలి'

గుంతకల్లు రూరల్: కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీని ప్రభుత్వం సుమోటోగా స్వీకరించిన నేపథ్యంలో వీఆర్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి వెరిఫికేషన్ చేస్తున్నారని, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారం ఆధారంగా గుంతకల్లు మండలంలో 7,876 మంది, మున్సిపాలిటీలో 23,326 మంది లబ్ధిదారులను గుర్తించి సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు ప్రక్రియను ప్రారంభించామన్నారు. అలాగే ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.